ప్రజాశక్తి

ఆదివారం 5 ఫిబ్రవరి 2023 | 5

పార్వతీపురం మన్యం

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని
7నుంచి యుటిఎఫ్ నిరహారదీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండల విద్యాశాఖాధికారి పివి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ అధ్వర్యంలో ఈనెల 7నుంచి నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, మండల కార్యదర్శి టి.రమేష్, ఎస్‌మురళీమోహనరావు, వి.వసంతనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోగా, వారిని దూషించడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులను మీరు ఏ సంఘంలో ఉన్నారని అడిగి మరీ కక్షసాధింపు చర్యలకు చేపడుతున్నారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు, ఎంపిడిఒకు ఫిర్యాదులు చేసినా, నిరసనలు తెలిపినా చర్యలు లేకపోవడంతో నిరాహార దీక్షలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నాలు

కొమరాడ : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

రైతుల వద్ద ఉన్న ధాన్యం తక్షణమే ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని పలు మండలాల్లో రైతులు తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేస్తూ ధాన్యం సేకరణకు చర్యలు తీసుకొని, మద్దతు ధర చెల్లించాలని చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని శనివారం స్థానిక తహశీల్దార్‌కు, ఎంపిపికి రైతుసంఘం, సిపిఎం నాయకులు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో సుమారు ఏడు వేల మెట్రిక్ పనులు ధాన్యం రైతుల వద్ద ఉన్నాయని, నూర్పు చేసి బస్తాలతో కల్లాల వద్ద నిల్వ ఉంచారని అన్నారు. ఇంకొంత మంది రైతులు ఇంకా వరిచేలు తెచ్చి నూర్పు చేయలేదని, ప్రభుత్వం ప్రతి ఏటా ఫిబ్రవరి నెలాఖరు వరకు మార్చి వరకు ధాన్యం కొనుగోలు ప్రోక్యూర్ మెంట్ ఇచ్చేదని అన్నారు. ఈ ఏడాది సంక్రాంతి ముందే ప్రొక్యూర్మెంట్ ఆపివేయడం దుర్మార్గమని అన్నారు. ఇప్పుడు కూడా ప్రొక్యూర్మెంట్ ఇస్తామని చెప్పడం తప్ప ఎక్కడ అమలు కావడం లేదని, పంచాయతీల వారీగా లక్ష్యాలు ఇచ్చినా సర్వర్ తెరవడంలేదని టెక్నికల్ సిబ్బంది చెప్తున్నారని అన్నారు. ప్రభుత్వం మొదటి నుంచి రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజ కొంటామని చెప్పి క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదని అన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారికి సిపిఎం నాయకులు కె.సీతారాం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని అన్నారు. రైతులకు అందుబాటులోకి వ్యవసాయ అధికారులు వుండాలన్నారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం ఎటువంటి షరతుల్లేకుండా కొనుగోలు చేయాలని, లేకుంటే రానున్న కాలంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డంగభద్ర సర్పంచ్ జోగి భుజంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు భూతాల మోహన్ రావు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం: రైతుల వద్దనున్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ ఎంవి రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే తామరకండి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస, ఆర్.వెంకంపేట, లక్ష్మీపురం, ఏగోటువలస, కృష్ణరాయపురం తదితర గ్రామాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయని, తక్షణమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి భాస్కరరావు జి వెంకటరమణ పితవిడ్ నాయుడు పుల్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయాయని, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మంనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం డిప్యూటి తహశీల్దారు రమణకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష్యం ముగిసిందంటూ ధాన్యం సేకరణ ఆపివేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, కొద్దిరోజులు క్రితం జాయింట్ కలెక్టర్‌తో నిర్వహించిన సమావేశంలో ఆర్‌బికెల ద్వారా ప్రతి ధాన్యపు గింజ కొంటామని చెప్పి ఇప్పుడు కొనుగోలు ఆపివేయడం అన్యాయమని అన్నారు. కావున తహశీల్దారు స్పందించి ధాన్యం కొనుగోలు చేసేలా ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.రాము, పి.వరలక్ష్మి, కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పి, నేటికి 40 శాతం మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయక నిల్వ ఉండే పరిస్థితి ఉందని అన్నారు. ఏ క్షణాన ఎటువంటి ప్రకృతి వైపరీత్యం సంభవిస్తుందని, ధాన్యాన్ని ఎలా రక్షించుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ధర్నాలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రైతులు గౌరునాయుడు, చిన్నంనాయుడు, ఆదిబాబు, సింహాచలం, కృష్ణమూర్తి నాయుడు, పోలియుడు, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురం: తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

లక్ష్యాలను చేరుకోవాలి : జిసిసి ఎమ్‌డి

ప్రజాశక్తి - సాలూరు

సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్

జిసిసి యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని సంస్థ ఎమ్ డి జి.సురేష్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక జిసిసి బ్రాంచి కార్యాలయం లో సాలూరు, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం బ్రాంచి మేనేజర్ లతో నిర్వహించిన సమీక్షా సమావేశం లో ఆయన మాట్లాడారు. గిరిజనుల ప్రయోజనాలే పరమావధిగా సంస్థ ఉద్యోగులు పనిచేయాలనా న్నరు. వారు సేకరించిన అటవీ ఉత్పత్తుల కు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన రైతులకు సీజినల్ గా, ఖరీఫ్ సీజన్లో పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిఎల్ పురంలో ఐఒసి గ్యాస్ ఏజెన్సీ, హెచ్ పిసిఎల్ పెట్రోల్ బంక్ నిర్వహణ ద్వారా 28కోట్ల ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఏడాది సంస్థ వ్యాపార లక్ష్యం 60కోట్ల రూపాయల ని, ఇంతవరకు 42.55కోట్ల మేరకు చేరుకున్నట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలని సూచించారు. 8రైతు భరోసా కేంద్రాల్లో ఆరుకోట్ల రూపాయల తో 29వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. డివిజన్ పరిధిలో 101 డిఆర్ డిపోల ద్వారా నిత్యావసర వస్తువుల ను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పార్వతీపురం డివిజన్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్, సాలూరు బ్రాంచి మేనేజర్ జె.రామారావు, జిఎల్ పురం బ్రాంచి మేనేజర్ కష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

వాహనదారులు పన్ను చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పన్నులు చెల్లించని వాహనదారులు ఈనెల 6లోగా టాక్స్ చెల్లించాలని జిల్లా రవాణాధికారి సి.మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో సుమారు 2651 మంది (గూడ్స్ వాహనాలు ట్రాక్టర్లు ట్రైలర్స్) వాహన యజమానులు రోడ్డు టాక్స్ చెల్లించకుండా వాహనాలు నడుపుతున్నారని, ఈ వాహన యజమానులంతా పన్ను చెల్లించాలన్నారు. టాక్స్ చెల్లించకుండా రోడ్డుపై నడిపిన వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి టాక్స్‌తో పాటు అపరాధ రుసుం విధించి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం

కాంగ్రెస్ ర్యాలీలో పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

విజయనగరం కోట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే తొలి సంతకమని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నుంచి బాలాజీ కూడలి వరకు నిర్వహించిన పాదయాత్రకు ముందు జెండాను ఎగరవేశారు. భారత జూడో యాత్ర లో రాహుల్ గాంధీ చేసిన వాగ్దానాలకు సంబంధించిన ఫ్లెక్సీని, కరపత్రాలను ఆవిష్కరించారు. చేయి చేయి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని అన్నారు. తెలుగు బిడ్డ పివి నరసింహారావు ప్రత్యేకించి విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.4వేల కోట్లు కేటాయించి ప్రత్యేకమైన అభివృద్ధి చేశారని అన్నారు. అలాంటి పరిశ్రమను నేడు బిజెపి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుందని అన్నారు. రానున్న రెండేళ్లలో రాహుల్ గాంధీ పిలుపుమేరకు ప్రతి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటామన్నారు. అనంతరం బాలాజీ జంక్షన్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి డోలా శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షరీఫ్, నగర పార్టీ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో రుణాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ పథకాలు పొందే లబ్దిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేస్తున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజరు జెఎల్ఎన్ మూర్తి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపదయోజన స్కీమ్ (విలువ ఆధారిత, లైవ్, ఫ్రెష్ ఫిష్ ఉత్పత్తుల మార్కెటింగ్) పై శనివారం స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశమందిరంలో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు ముందుగానే ఆయా సంస్థలు బ్యాంకులతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటాయని, కావున లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రుణాలు పొందిన లబ్దిదారులు ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పొందేందుకు వ్యాపారాన్ని మూడేళ్ల పాటు నడిపించాల్సి ఉంటుందని, మధ్యలో వ్యాపారం మానేస్తే మొత్తం రుణాన్ని లబ్దిదారుడే భరించాల్సి ఉంటుందని అన్నారు. కావున సబ్సిడీ ఆశించి రుణాలు పొందవద్దని తెలిపారు. జిల్లా మత్స్యశాఖాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ఈ పథకం కింద మినీ అండ్ స్నోక్స్ అవుట్ లెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి గాను రెండువేలకు పైగా జనాభా కలిగిన 66 రైతు భరోసా కేంద్రాల్లో మినీ ఫిష్ అవుట్ లెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 10 లక్షలు, 20 లక్షలు, 30 లక్షలు విలువ కలిగిన అవుట్ లెట్స్ ఏర్పాటుకు ప్రభుత్వం బ్యాంకుల ఎస్‌సి, ఎస్‌టి, మహిళలకు 60శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో లబ్దిదారుని వాటా చెల్లించిన 42మందికి రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, మెప్మా ఎపిడి సత్యంనాయుడు, ఫిషరీష్ అసిస్టెంట్స్,యితర సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

మోడీ పాలనలో కార్పొరేట్లకు ఊడిగం

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి- సాలూరు

మోడీ పాలనలో కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా పేదలు, ధనిక వర్గాల మధ్య అగాధం పెరిగిందని అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను మరింత నిరుపేదలగా, ధనవంతులను అపర కుబేరులుగా బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వున్నాయని చెప్పారు. పేదవాడు తన జీవితాంతం లక్ష రూపాయల ఆదాయం సంపాదించే అవకాశం లేదని, అంబానీ అదానీలు గంటల వ్యవధిలో వందల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని చెప్పారు కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందని చెప్పారు. పేదలకు మేలు చేసే పథకాలకు నిధులు కోత విధించడంతో కార్పొరేట్‌లకు వరంలా మారిందని విమర్శించారు. మోడీ ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, వంతల సుందరరావు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ఆర్‌టిసి బస్సు బోల్తా ; ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బోల్తాపడిన ఆర్‌టిసి బస్సు

మండలంలోని మండ గ్రామ సమీపాన ఉన్న ప్రధాన రహదారి మలుపు వద్ద శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే పార్వతీపురం డిపోకు చెందిన ఎపి 28 జెడ్ 4859 నెంబర్ గల పల్లె వెలుగు బస్సు గుమ్మలక్ష్మీపురం నుంచి 23మంది ప్రయాణికులతో బయలుదేరి పార్వతీపురం వెళ్తుండగా మండ గ్రామ సమీపాన ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న విశాఖపట్నం -నీలకంఠాపురం ఎక్స్‌ప్రెస్‌ను తప్పించే క్రమంలో సమీపానున్న వంతెన గోడకు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో బొద్దిడి గ్రామానికి చెందిన విజయశాంతి (31), కోనగూడ గ్రామానికి చెందిన హైమావతి (24) స్వల్ప గాయా లతో బయటపడ్డారు. డ్రైవర్ శ్రీరాములు సురక్షితంగా బయటపడ్డారు. రహదారికి అడ్డంగా బస్సు పడడంతో గంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటన స్థలానికి ఎల్విన్ పేట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు, పార్వతీపురం ఆర్టీసీ డిఎం దుర్గమ్మ చేరుకొని పరిశీలిం చారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జగనన్న గృహ నిర్మాణానికి లబ్దిదారులకు రూ.5లక్షలు మంజూరు చేయాలని, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లబ్దిదారుల సమస్యలు పరిష్కరించాలని శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, సిపిఐ ఎంఎల్ రైతుసంఘం బొత్స నరసింగరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ భాస్కరరావు, పి.సంఘం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ తదితర నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో జగనన్న గృహ సముదాయాల నిర్మాణాలు ఎక్కడా సవ్యంగా జరగడం లేదన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోక లబ్దిదారులు గగ్గోలు పెడుతున్నారని, జగనన్న కాలనీలో చాలా గృహాలు పునాదులకే పరిమితమయ్యాయని, ప్రభుత్వ సహాయం సరిపోక అదనపు భారం భరించలేక చాలామంది ఇళ్లు కట్టుకోలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.5లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఇనుము, సిమెంట్, ఇసుకను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని కోరుతూ ఈనెల 6న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం : ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి రాకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయ్య కోరారు. శనివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతి భయంకరమైన వ్యాధి కేన్సర్ అని అన్నారు. ఈ వ్యాధికి ప్రధానంగా గుట్కాలు నమలడం, ఎక్కువగా పొగ తాగడం, మద్యపానాన్ని సేవించడం, వేపుడు పదార్థాలు ఎక్కువగా తినడం, ఎరుపు రంగు మాంసాన్ని(రెడ్ మీట్) తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగి కేన్సర్ వంటి వ్యాధులకు వ్యక్తులు గురవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ పెద్ద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

అబద్దాల కోరు చంద్రబాబు

- ప్రచారం కోసమే లోకేష్ పాదయాత్ర
- గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

ఇచ్చిన హామీ అమలు చేయని నాయకుడు చంద్రబాబు నాయుడుని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. శనివారం స్థానిక కోదండరామ కల్యాణమండపంలో మండలానికి చెందిన గృహ సారథులు సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల జగనన్న గృహసారథి కన్వీనర్ కె.త్రినాథనాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు, మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు వారిని నిలువునా ముంచేశారని చెప్పారు. ఆయన అబద్దాలను ప్రచారం చేయడానికే లోకేష్ పాదయాత్ర ప్రారంభించారని చెప్పారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికే వాలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వీరు ప్రజల వద్దకు నేరుగా సంక్షేమ పథకాలను చేరవేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చారన్నారు. ఇప్పుడు గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఆ గురుతర బాధ్యతలు ఉన్నాయని చెప్పారు. నిర్దేశిత నమూనాలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలని కోరారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంటే కారణాలు రాబట్టాలని, సలహాలు సూచనలు స్వీకరించాలని కోరారు. అనంతరం గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లకు పార్టీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెంకంపేటలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు గృహసారథులు, వార్డు, మండల కన్వీనర్ల నియామకం జరిగిందని, వీరంతా ప్రజలకు మరింతగా చేరువై రాబోయే ఎన్నికల్లో 175కి 175 సీట్లు గెలిచేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల చెంతకు వెళ్లడంతో పార్టీ బలపడిందని, దీన్ని ఫలితంగా మార్చుకోవడానికి కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు కృషి చేసి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్దా జగన్నాధరావు, పూడి శంకరరావు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, గండిశంకర ఎంపిటిసి బంకురు రవికుమార్, నాయకులు బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, తీళ్ల శివున్నాయుడు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పార్వతీపురం టౌన్ : మన అందరి నమ్మకం జగన్ ఎమ్మెల్యేయ అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని బెలగాంలో కన్వీనర్లు, వాలంటీర్లు గృహ సారథులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11న నియోజకవర్గ వ్యాప్తంగా ప్రారంభం కానున్న "మా నమ్మకం నువ్వే జగన్" కార్యక్రమం ద్వారా గృహ సారథులంతా సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు సహాయంతో ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కె.రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వర్రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పట్టణ జేసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన అధికార, ప్రతిపక్ష గళం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మౌనం అర్ధంగీకారం అంటారు పెద్దలు. ఇంకా చెప్పాలంటే మేధావుల మౌనం సమాజాభివృద్ధికి ఆటంకం అనికూడా మరికొందరు వ్యాఖ్యానిస్తుంటారు. పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప అని కూడా చెబుతుంటారు విప్లవబాట పట్టినవారు. అడక్కపోతే అమ్మయినా పెట్టదంటారు సానుకూల ధృక్పదంతో ఇంకొందరు. కానీ, ఇవేవీ పట్టలేదు మన జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు, నాయకులకు. ఔను నిజమే...! కేంద్ర బడ్జెట్ కేటాయింపులో బిజెపి ప్రభుత్వం కనికరం చూపకపోయినా, వివక్ష ప్రదర్శించినా, నిర్లక్ష్యపు వరదలో ముంచేస్తున్నా కనీసం నోరు మెదపలేదు. సరిగ్గా ఇవే విషయాలను, సూక్తులను, వ్యాఖ్యలను గుర్తుచేస్తూ చర్చిస్తున్నారు జనం. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! 'మన రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు, ప్రత్యేకించి మన జిల్లాకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం, వివక్ష అంతా ఇంతా కాదు. ఆ మోసాలు మాటల్లో చెప్పలేనివి. రాతలకు సరిపోనివి'. అంటూ జనం కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ ప్రభుత్వం మన రాష్ట్రానికి ఐదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామంటే... కాదు కాదు కనీసం పదేళ్లైనా హోదా ఇవ్వాలంటూ నాటి బిజెపి ప్రభుత్వం పట్టుబట్టింది. ఇదే కాదు. అధికారంలోకి వస్తే ఏటా కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనాన్ని వెలికి తీయడమే కాకుండా, అలా వెలికి తీసిన సొమ్మును ఏకంగా పేదల ఖాతాల్లోనే జమచేస్తామని కూడా బిజెపి నేతలు ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక జన్‌ధన్ అంటూ బ్యాంకు ఖాతాలను తప్పనిసరి చేశారు. ఆ తరువాత నోట్ల రద్దు, అనంతర పరిణామాల గురించి వేరేగా చెపనక్కర్లేదు. విభజన హామీలో భాగంగా వెనుక బడ్డ జిల్లాకు ఇచ్చే ప్రత్యేక

నిధులనూ అర్ధాంతరంగా ఆపేశారు. ఇన్నాళ్లూ ఎదురు చూసినప్పటికీ ప్రధానిగా మోడీ చివరి బడ్జెట్ ఈనెల 1వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బడ్జెట్‌లో విభజన హామీలు ఎలాగూ నెరవేరలేదు. కనీసం సొంత భవనం లేక అద్దె భవనంలో నడుపుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధులను కూడా కేంద్రం తగ్గించేసింది. ఇక ఎయిర్‌పోర్టు, మెడికల్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన ఆర్థిక సాయం ఎండమావిగానే మిగిలిపోయింది. చివరకు మన జిల్లా నడిబొడ్డున ఎంతో ఆటకంగా ఉన్న మానాపురం రైల్వే వంతెన నిర్మాణానికి కూడా రూ.2లక్షలకు మించి కేటాయించలేదంటే జిల్లాపై ఎంత నిర్లక్ష్యం ప్రదర్శించిందో వేరేగా చెప్పనక్కర్లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర వైఖరిపై సిపిఎం, సిపిఐ, సిఐటియు తదితర సంఘాలు మాత్రమే స్పందించాయి. వివిధ రూపాల్లో నిరసన తెలిపాయి. ఈ విషయంలో జిల్లాలో ఇతర పార్టీల గొంతు మూగబోయింది. కనీసం ప్రకటన రూపంలో కూడా ప్రశ్నించకపోవడం పట్ల యావత్తు ప్రజానీకం విస్తుపోతున్నారు. అధికార, ప్రతిపక్షాలకు ఎన్నికలు, అధికారం తప్ప రాష్ట్రంపైనా, జిల్లాపైనా కేంద్రం చేస్తున్న పరోక్షదాడి పట్టడం లేదని చర్చించుకుంటున్నారు. కనీసం ఎంపీ అయినా పార్లమెంట్‌లోపల లేదా బయట నోరు మెదపకపోవడం దారుణమంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. మానాపురం జాతీయ రహదారిపై తలపెట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొన్ని దశాబ్దాలుగా సాగుతోంది. చిత్తశుద్ధి ఉంటే కొన్ని నెలల్లో పూర్తిచేసేందుకు అవకాశం ఉంది. కానీ, స్థానిక ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ, రాష్ట్రంలోని మంత్రులుగాని కేంద్రాన్ని కనీసం ప్రశ్నించకపోవడం వల్ల రైల్వే శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇలా వారు వీరు అని కాదు. జిల్లాలోని అందరి ఎమ్మెల్యేల తీరు ఇలాగే ఉంది. రాష్ట్ర విభజన హామీలు, ముఖ్యంగా ప్రత్యేక హోదా అమలు చేయాలంటూ విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన యాత్ర జిల్లాకు చేరినప్పుడు కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలకు కనీసం సంఘీభావం తెలియజేయక పోవడంతో విధానాల విషయంలో దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని పబ్లిక్ టాక్.

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల విధులు హాజరుకు సంబంధించి కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్ (ఫెస్ రిక్నైజ్ సిస్టం) విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎపిఎఫ్ఆర్ఎస్ విధానం కార్మికుల్లో తీవ్ర ఆందోళనలు

పార్వతీపురం: ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గురిచేస్తుందన్నారు. అలాగే కార్మికుల సొంత ఫోన్లలో ఈ యాప్‌ను వినియోగించమని చెబుతుందని, దీనివల్ల ఫోన్ల వాడకం తెలియని, చదువు లేని కార్మికులు చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. ఫోన్లు కొనాలని, ఈ విధానం అమలు చేయాలని నిర్బంధం చేయడాన్ని సిఐటియు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఈ విధానం అమలు చేయాలని కార్మికులను భయభ్రాంతులకు గురి చేయటం సరైనది కాదని, ఈ విధానం ఆపాలని, ప్రస్తుతం అమలవుతున్న ఎండిఎఫ్ఆర్ఎస్ విధానం కొనసాగించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.శంకర్రావు, కార్యదర్శి మల్లేశు, గుంపు స్వామి, శివ, సింహాచలం, సిఐటియు పట్టణ నాయకులు సూరిబాబు, రవి, రాజేష్, చిన్నమ్మలు, లీల తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అమలు చేస్తున్న ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు, పర్మినెంట్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్వై నాయుడు, ఎఐటియుసి సీనియర్ నాయకులు ఎస్.రామచంద్రరావు ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు, తక్కువ చదువు వున్న వారు వున్నారని చెప్పారు. వారిలో చాలామందికి సెల్ ఫోన్లు కూడా లేవన్నారు. ఈ కారణాల రీత్యా ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ డిఎంఎకి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేనేజ్‌మెంటుపై వేధింపులు ఆపాలని, పాత వార్డు లోనే ఆయనకు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు రెడ్డి వేణు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు పి.రాముడు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శంకరరావు

నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

ఓటీలైనా చెల్లించాలి..డ్యూటీలైనా మార్చాలి

పాలకొండ : ఓటీలైనా చెల్లించాలి, డ్యూటీలైనా మార్చాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) నాయకులు ఎ.ఎస్.నాయుడు, డి.గోవిందరావు, టి.కె.రావు అన్నారు. శనివారం పాలకొండ డిపో వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల లీవ్ అండ్ క్యాష్‌మెంట్, ఆర్‌పిఎస్ 2017 బకాయిలు సత్వరం చెల్లించాలని, విలీనం పేరుతో ఆర్‌టిసి కార్మిక, ఉద్యోగులకు అనేక సౌకర్యాలు కత్తిరించారని, డిపో మేనేజర్ల అక్రమ పనిష్మెంట్లు ఆపాలని, 1/2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము, ప్రజాసంఘాల నాయకులు డి.దుర్గారావు వీరికి మద్దతు తెలుపుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో కార్మికులకు అండగా ఉండి ఐక్యపోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వాణీ జయరాం, విశ్వనాథ్‌కు నివాళి

సాలూరు : ప్రముఖ దర్శకుడు కళాతపస్వి విశ్వనాథ్, గాయనీమణి వాణీ జయరాం మృతి పట్ల స్థానిక శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు నివాళులర్పించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తెలుగు సినిమా పరిశ్రమకు చెందిన ఇద్దరు ప్రముఖులకు నివాళి అర్పించారు. వీరి మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

సాలూరు: పట్టణ పోలీస్ స్టేషన్‌ని శనివారం పార్వతీపురం డిఎస్‌పి ఎ.సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట అర్బన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, టౌన్ ఎస్ఐలు పాపారావు, నారాయణరావు వున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతులు

గిట్టుబాటు ధర కల్పించాలని పోస్టర్ ఆవిష్కరణ

పాచిపెంట : మండలంలోని మోసూరు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు సింహాచలం నాయుడు చెప్ప రామ్మూర్తి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులు ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీరించే ఆలోచనలో భాగంగా వ్యవసాయ చట్టాలను తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. రైతులు దగ్గర కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే మద్దతు ధర ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. గతేడాది కూడా బకాయిలు ఉన్న రైతులకి డబ్బులు వెంటనే చెల్లించి ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు, చెప్ప దేవుడు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత పరికరాలకు ఎంపిక శిబిరం

సాలూరు రూరల్ : ఈ నెల 6న సాలూరులోని భవిత కేంద్రం వద్ద పార్వతి పురం మన్యం జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ కో ఆర్డినేటర్ ఆదేశాలు ప్రకారం వికలాంగ పిల్లలకు ఉచిత పరికరాలు ఎంపిక శిబిరం నిర్వహిస్తామని ఎంఇఒ బత్తుల రాజా కుమార్ అన్నారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాలల్లోని వికలాంగులైన శారీరిక వైకల్యం, వినికిడి లోపం కలిగిన వారికి ఎంపిక కార్యక్రమం, నిర్వహిస్తామన్నారు. వారికి మూడు చక్రాల వాహనం, వినికిడి లోపం కలవారికి చెవిటి యంత్రానికి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బలిజిపేట : నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పాలకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి హెచ్చరించారు. శనివారం ఆమె మండలంలోని గళావల్లి, గంగాడ, వంతరాం, బలిజిపేట గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా లోటు పాట్లను సరిదిద్దికోమని చెప్పారు. ఎరువులు షాపులు అన్నింట్లోనూ రికార్డులు, స్టాక్ వివరాలు సరిగ్గా ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాలంటీర్ సేవలకు అభినందన

వీరఘట్టం : మండలంలోని కిమ్మి గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ ప్రసాద్ సేవలకు సర్పంచ్ జి. రామ్మోహన్‌రావుతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన అలుజు గౌరమ్మ అనారోగ్య కారణంగా శ్రీకాకుళంలోనే రాగోలు జేమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని శనివారం గ్రామ వలంటీర్ ప్రసాద్ తమ సొంత డబ్బులు ఖర్చుపెట్టుకుని రాగోలు జేమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌరమ్మకు పింఛన్ అందించారు. దీంతో గ్రామస్తులు వాలంటీర్‌ను అభినందించారు.

ముగిసిన మహాలక్ష్మి పేరంటాలు వారోత్సవాలు

వీరఘట్టం : మండలంలోని తెటంగి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహాలక్ష్మి పేరంటాలు 46వ వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. కీర్తిశేషులు గుజ్జల రాము కుమారుడు గుజ్జల నారాయణరావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది దంపతులచే శ్రీనివాస కళ్యాణం పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అన్నదానంతో పాటు వస్త్ర దానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొట్నూరు లక్ష్మణరావు, పరిశినాయుడు, సతివాడ సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

భామిని : బత్తిలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పిఎసిఎస్)లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా 4శాతం వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకోవాలని బత్తిలి పిఎసిఎస్ అధ్యక్షులు బోదేపు రఘుపతి నాయుడు తెలిపారు. శనివారం బత్తిలి కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నిర్ణీత గడువులోగా రుణాలు రెన్యూవల్ చేస్తేనే ప్రభుత్వం అందించే వడ్డీ రాయతీ లభిస్తుందన్నారు. రుణాలు రెన్యూవల్ 4శాతం వడ్డీతో పాటు పాస్ బుక్, ఆధార్ జెరాక్స్, ఒరిజినల్ 1బి, పాస్ ఫోటోతో బత్తిలి పిఎసిఎస్‌కు రావాలన్నారు. నిర్ణీత గడువు తీరిన తరువాత రుణాలు రెన్యూవల్ చేయాలంటే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు.

రూ.257 వేతనం రావాలి

సీతంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా వేతన దారులకు రూ.257 కూలి వచ్చేలా కొలతలు ఇవ్వాలని ఎంపిడిఒ కె.గీతాంజలి ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లకు ఆదేశించారు. శనివారం మండల ంలో కుడ్డపల్లి పంచాయతీ పులిగుమ్మి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహి స్తున్న పనులను ఆమె పరిశీలించారు. వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. అనం తరం మినీ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం అందుతుందా లేదా అని ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఒకటో తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులు స్టాండర్డ్ విద్యా ప్రమాణాలు తెలుసుకొన్నారు.

సమయాన్ని పాటించండి

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ వేతన దారులు సమయాన్ని పాటించాలని ఎపిఒ జి.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని దయానిధిపురం, జానుములవలసలో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి వేతనదారులు సమయానికి వచ్చి పని చేస్తే ప్రభుత్వం రోజుకు రెండు 57 కూలి వస్తుందని రెండు పూటలా పనిచేయాలన్నారు. ఉపాధి కూలీలు మస్తర్లను పనిలో ఉండే ప్రదేశాల నుంచే పంపించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో అడుగడుగునా నిర్లక్ష్యం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భూతాపాన్ని తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రహదారుల పక్కన మొక్కల పెంపకం ఉపాధిహామీ అధికారులు, సాంకేతిక సిబ్బంది, క్షేత్రసహాయకులు నిర్లక్ష్యం వల్ల పూర్తిగా నిరుగారిపోయినట్లు ప్రజావేదిక, సామాజిక తనిఖీలో తేటతెల్లమైంది. శనివారం ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో ఎంపిడిఒ ఆకిబ్‌జావేద్, ప్రిసైడింగ్ అధికారి జి.శ్రీహరి, డిఎల్‌డిఒ చంద్రమ్మ, విజిలెన్స్ అధికారి రవీంద్ర సమక్షంలో జరిపిన పరిశీలనలో రూ 27,05,25,345తో 26 పంచాయితీలో నిర్వహించిన 1641 పనులపై ఆడిట్ నిర్వహించగా, పెదమరికి పంచాయితీలో పనులు చేయకుండానే సుమారు రూ.8లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. పెదబొండపల్లి మినహాయించి దాదాపు అన్ని పంచాయితీలో మొక్కలు చనిపోయినట్లు గుర్తించారు. అడగడుగున సాంకేతిక సహాయకుల నిర్లక్ష్యం, ఎపిఒ అలసత్వం, క్షేత్రస్థాయి సిబ్బంది వైఫల్యం కనిపిస్తుందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనుల వివరాలు తెలియజేస్తూ నామఫలకాలు ఏర్పాటు కూడా ఎక్కడా ఏర్పాటు చేయకపోవడంతో వారం రోజుల్లో ఈ పనులు నిర్వహించాలని, ఆర్థిక అవకతవకలకు బాధ్యులను గుర్తించి వారి నుంచి రికవరీ చేయాలని నిర్ణయించి సమావేశం ముగించారు. సమావేశంలో అంబుడ్స్‌మెన్ కె.సన్యాసిరాజు, క్వాలిటీకంట్రోల్ అధికారి శేషగిరి, స్టేట్‌రిసోర్స్‌పర్సన్ ఎస్.మీరావలి, ఎపిఒ భాను, టిఎ, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి మజ్జి శోభారాణి

ధాన్యం కొనాలని టిడిపి ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

యోజకవర్గం పరిధిలో గల రైతుల నుంచి వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా సివిల్ సప్లై అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల పరిధిలో కొన్ని అనివార్య కారణాల వల్ల నూర్పులు ఆలస్యంగా చేపట్టిన రైతుల కళ్లాలోనే ధాన్యం నిల్వ ఉండిపోయాయని, రైతులు దగ్గర ప్రతిగింజ కొనుగోలు చేస్తామని చెప్పిన అధికారులు కొనుగోలు నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కావున అధికారులు పరిస్థితి గమనించి వెంటనే పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటనాయుడు, పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న టిడిపి నాయకులు

ఆపదలో ఉన్నవారికి అభయ హస్తం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అభయహస్తం అందిస్తున్నారు మండలానికి చెందిన వ్యాపారి మద్ది దొరబాబు. మండల కేంద్రంలో ఎవరైనా మృతి చెందితే ఆ సమయంలో ఆ కుటుంబంలో అందరూ శోకసంద్రంలో మునిగిపోతారు. అటువంటి సమయంలో కుటుంబంలో వంట చేసేందుకు కూడా మనసు రాక ఆకలితోనే కొంతమంది ఉండిపోతుంటారు. చుట్టాలు, బంధువులు కూడా ఆకలితోనే ఉంటూ ఉంటారు. ఈ మేరకు అటువంటి కుటుంబాలకు మండల కేంద్రానికి చెందిన మద్ది దొరబాబు 20 భోజనాలను అందిస్తున్నారు. ఇటువంటి ఆపన్న కుటుంబాలకు దొరబాబు అందిస్తున్న కొద్దిపాటి అభయ హస్తాన్ని ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలో సూర్యారావు అనే వ్యక్తి మతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబానికి సర్పంచ్ గౌరీ శంకర్రావు, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాదరావు, దోస్త్ మేరా దోస్త్ గ్రూపు అధ్యక్షులు కొనిస సూర్యప్రకాశరావు, వార్డు సభ్యులు వెంకట్రావు, తిరుపతిరావు, భోగాపురం నాగులు ఆధ్వర్యంలో అందించారు. ఇకపై గ్రామంలో ఎవరైనా శోకసంద్రంలో ఉన్నప్పుడు స్థానిక సర్పంచుకు గాని, గ్రామస్తులకు గాని తెలియజేస్తేఉచితంగా భోజనాలను అందిస్తామని దొరబాబు తెలిపారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న నిర్వాహకులు

వైసిపి నాయకుల్లో వణుకు : టిడిపి

ప్రజాశక్తి -గుమలక్ష్మీ పురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపడుతున్న పాదయాత్ర 100 కిలోమీటర్లు పూర్తయితేనే వైసిపి నేతల ప్యాంట్లు తడుస్తున్నాయని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె మాట్లాడారు. లోకేష్ పాదయాత్రకు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాధరణ చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న జగన్‌కు ఓటమి భయంతో చెమటలు పడుతున్నాయని అన్నారు. ఆ భయంతోనే కొందరు అధికారులు పోలీసుల్ని తమ చెప్పు చేతుల్లో పెట్టి పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా తమ కార్యకర్తలపై అనేక తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించారంటూ లోకేష్‌తో పాటు అమర్నాథరెడ్డి, పులిపర్తి నాని, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి తదితర నేతలపై కేసులు పెట్టడం విచారకరమన్నారు. టిడిపి కార్యకర్తలపై దాడి చేసి వారిపైనే హత్యాయత్నం కేసులు పోలీసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అసలు ఈ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుందా లేదా రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందా అన్నది అర్థం కావడం లేదన్నారు. నాడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసేటప్పుడు తమ నాయకులు, నారా చంద్రబాబునాయుడు ఇలా ప్రవర్తించి ఉంటే అసలు జగన్మోహన్ రెడ్డి ఒక్క అడుగైన బయటకు పెట్టగలిగేవారా అని ప్రశ్నించారు. జగన్ ఎన్ని ఆడంకులు సృష్టించినా లోకేష్ పాదయాత్రను దిగ్విజయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు ఉన్నారు.

కట్టె జనుము విత్తనాల పరిశీలన

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మండలంలోని పి.ఆర్.రాజుపేట గ్రామంలో అభ్యుదయ రైతు, ఏరువాక సభ్యుడు వేసిన కట్టె జనుము విత్తనాలు సువిన్, ఎస్‌హెచ్-4 రకాలను ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఎమ్.స్వాతి, కె.తేజేశ్వరరావు శనివారం పరిశీలించారు. 2 నెలలు కింద ఇచ్చిన విత్తనాలు బాగున్నాయని, మంచి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. తదుపరి సీతంపేట మండలం దొనుబాయి గ్రామంలో తేనెటీగల పెంపకం కేంద్రాన్ని పరిశీలించారు. ఏరువాక కేంద్రం గిరిజన ఉప ప్రణాళిక ద్వారా అభివృధి చేయడానికి దోనుబాయి, పరిసర ప్రాంతాల్లో 20 నుండి 40 మందిని ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. తేనెపట్టులను ఏరువాక కేంద్రం సలహా మండలి సభ్యులు ఖండపు ప్రసాదరావు ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారన్నారు. వీరితో పాటు వెలగవాడ రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు జె.మణికంఠ ఉన్నారు.

రామతీర్థంలో ఘనంగా రథయాత్ర

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సీతారామ స్వాముల రథయాత్ర శనివారం రాత్రి ఘనంగా జరిగింది. రామస్వామి దేవస్థానంలో అర్చకులు వెండి మందిరంలో ప్రాత్ణ కాల అర్చన జరిపించి భక్తులకు దర్శనం జరిపారు. ఈ నెల 1న జరిగిన సీతారాముల కళ్యాణంలో భాగంగా రథయాత్ర జరపడం ఆనవాయితీగా వస్తుంది. వార్షిక కళ్యాణ ఉత్సవ మూర్తులు సీతా లక్షణ సమేత రామ స్వామిని గరుడ, హంస, అశ్వ వాహనంపై సీతా రాముని పేటకు చెందిన భక్తులు కోలాటాలు, మేళా తాళాలతో పురవీధుల్లో ఊరేగించి తిరిగి దేవస్థానంలోకి తీసుకు వచ్చారు. అంతక ముందు ఉద్దండ వేద పండితులచే పండిత పరిషత్ నిర్వహించారు. ఈ సంధర్భంగా పండితులను సన్మానించారు. దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, అర్చకులు గోడ వర్తి నరసింహాచార్యులు, ఖండవిల్లి కిరణ్, పాణంగి పల్లి ప్రసాద్ పూజలు నిర్వహించారు. త

వెనుకబడ్డ విద్యార్థులపై దృష్టి

వీరఘట్టం : విద్యాభివృద్ధిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి పి.విష్ణుమూర్తి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులు గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టేలా చూడాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులపై కూడా దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో తలవరం, నీలానగరం, బిటివాడ, వండువ, కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు డి.నాగమణి, ఉప్పాడ అప్పారావు, జి.రవిప్రసాద్, సిహెచ్ రత్నాకర్, వి.భాస్కరరావు, కెపి నాగమణి, పాల్గొన్నారు.

పైపులైను ఏర్పాటు చేయాలని వినతి

వీరఘట్టం : మండలంలోని హుస్సేన్‌పురం బొత్సవీధిలో పైప్ లైన్ ఏర్పాటు చేయాలని ఆ వీధికి చెందిన మహిళలు ఎంపిడిఒ ఎ.ప్రభాకర్‌రావుకు వినతిని అందజేశారు. గ్రామంలోని అన్ని వీధులకు జలజీవన్ మిషన్ ద్వారా పైప్‌లైన్లు ఏర్పాటు చేసి మా వీధికే ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై గ్రామ సచివాలయ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోలే దన్నారు. ఇప్పటికైనా స్పందించి జల జీవన మిషన్ ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని మహిళలు కోరారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

వీరఘట్టం: మండల సిబ్బంది సక్రంగా విధులు నిర్వహించాలని ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమయపాలన పాటించి కేంద్రాలు తెరవాలని, గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం సక్రమంగా పంపిణీ చేయాలని అన్నారు. రికార్డుల నిర్వహణ కూడా సక్రంగా ఉండాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ పూర్ణిమ, సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, రత్నంతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

కురుపాం : మండలంలో కిచ్చాడలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న ఇద్దరు కవల పిల్లలు రెడ్డి విశాల్, రెడ్డి నిశాల్‌కు వైయస్సార్ పెన్షన్ కానుక ద్వారా కొత్తగా మంజూరైన రూ.10వేలు పెన్షన్లను శనివారం స్థానిక సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయచంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా వారు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతుండడం వల్ల వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. వీరికి పెన్షన్ మంజూరవడం కొంతవరకు వారి మందులు ఖర్చులు నిమిత్తమైనా ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పైల సత్యంనాయుడు, గ్రామ గృహసారధి కోట శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డిసి కార్యాలయం ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురంలో నిర్వహిస్తున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కార్యాలయం గుమ్మలక్ష్మీ పురం (ఎల్విన్‌పేట)కు తరలించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ ఉప ప్రణాళిక మండలాల్లోని షెడ్యూల్డ్ ఏరియా లో 1/70చట్టం పకడ్బందీగా అమలు చేసి గిరిజన ప్రాంతాల్లో భూముల రక్షణకు ఏర్పాటు చేసిన స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కార్యాలయం మూడేళ్ల క్రితం గుమ్మలక్ష్మీ పురం(ఎల్విన్ పేట) నుంచి తరలించి పార్వతీపురంలో కార్యాలయం నిర్వహించడం లక్ష్యానికి పూర్తి విరుద్ధం అన్నారు. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌కు ఆర్డీవో హెూదా ఇచ్చి గిరిజన ప్రాంతాల్లో భూముల రక్షణ చేయాలని అంటే పార్వతీపురం లో కార్యాలయం ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే గుమ్మలక్ష్మీపురానికి కార్యాలయం తరలించాలని జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ ను కోరారు.

చల్లంనాయుడువలసలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం : మండలంలోని చల్లమనాయుడువలసలో శనివారం బూర్జ ఆయుర్వేదిక వైద్య అధికారి టి అమాక్షీ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీళ్ళు, ఒంటి నొప్పులు, జ్వరం, దగ్గు ఉన్న వాటికి ఆయుర్వేదిక మందులు ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆయుర్వేదిక్‌తో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆమె అన్నారు అనంతరం 80 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.భారతం, పారమ్మ, ఎఎన్ఎం, ఎంహెచ్‌ఒలు, రోగులు పాల్గొన్నారు.

హడ్డుబంగి పాఠశాలలో నేత్ర శిబిరం

సీతంపేట : మండలంలోని అడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం నేత్ర శిబిరం నిర్వహించారు. కొత్తూరు ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం ఆప్తల్ మిస్ట్ ఇప్పిలి జానకి రామయ్య 575 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. 17 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కంటి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమా వాణి, ఏఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: తనిఖీలు చేస్తున్న వైద్యులు

పెదపెంకిలో కంటి వైద్య శిబిరం

బలిజిపేట: మండలంలోని పెదపెంకి సత్యసాయి మందిరంలో నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విజయనగరం వెంకట పుష్పగిరి హాస్పిటల్ ఆప్తా లిస్ట్ డాక్టర్ వి. కిరణ్ ఈ సందర్భంగా 19 మందికి తనిఖీలు నిర్వహించారు. ఇందులో 13 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి ఆపరేషన్ చేసి మందులు, కళ్లద్దాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్రి శ్రీనివాస్‌రావు, నాగిరెడ్డి, త్రినాద్, రాముడు పాల్గొని సేవలు అందించారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

డ్రైవర్ మృతి, మెకానిక్‌కు గాయాలు

పాచిపెంట:: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఘాట్‌రోడ్డు వద్ద శనివారం లారీ బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ మృతి చెందగా, మెకానిక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ ఎంవి రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని నందాపూర్ నుంచి సిమిలిగూడ మీదుగా ఖుర్దాకు క్రేన్‌కు సంబంధించిన సామాగ్రి లోడుతో లారీ తీసుకెళ్తుంది. సుంకి ఘాట్ రోడ్డు మీదుగా వస్తుండగా మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్ట్ కు సుమారు కిలో మీటరు దూరంలో (ఆంధ్రా-ఒడిశా ఘాట్‌రోడ్డు) లారీ అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన డ్రైవర్ అభయ్ కుమార్ సాహు (44) కేబిన్‌ను ఇరుక్కుపోయాడు. సంఘటన తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను కాపాడేందుకు గ్యాస్ కట్టర్ క్రేన్ ద్వారా సుమారు 2గంటల పాటు ప్రయత్నించి డ్రైవర్‌ను బయటకు తీశారు. వెంటనే ఆయన్ను 108 ద్వారా సాలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. అందులో ప్రయాణిస్తున్న మెకానిక్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఆయనకు సాలూరులో చికిత్స అందిస్తున్నారు. లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో సుమారు రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానిక పోలీసులు క్రేన్ ద్వారా లారీని తొలగించడం యధాతథంగా వాహన రాకపోకలు జరిగాయి. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోయలో పడిపోయిన లారీ

నవధాన్యాల సాగుతో మేలు

పాచిపెంట: నవధాన్యాల సాగుతో రైతుకు ఎంతో మేలు జరుగుతోందని మండల వ్యవసాయాధికారి తిరుపతిరావు అన్నారు. రైతులు విచక్షణ రహితంగా ఎరువులను వాడుతూ భూమిని సారవంతం చేయకుండా సంవత్సరాలుగా ఏక పంటను సాగు చేయడం వల్ల భూమి తన స్వభావాన్ని కోల్పోయి నిస్సారంగా మారి రాబోయే కొన్ని సంవత్సరాలలో పంటలు పండించడానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. మండలంలోని కేసలీలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసలిలో ఎక్కువగా మొక్కజొన్న పంట తర్వాత, మరలా మొక్కజొన్న సాగును చేపడుతున్నారని దీంతో భూమి సారవంతం కోల్పోతుందన్నారు.